హాస్టల్ గదుల్లోకి పోలీసుల రాకను నియంత్రించండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లోని హాస్టల్ గదుల్లోకి పోలీసుల రాకను నియంత్రించాలని ఏఐఎస్ఎఫ్ ఓయూ కార్యదర్శి నెల్లి సత్య డిమాండ్ చేశారు. గురువారం ఉస్మానియా ఫౌండేషన్ భవన్ భూమి పూజలకు వచ్చే పూర్వవిద్యార్థులతో మాట్లాడాలన్నారు. చివరికి పోలీసుల వాహనంలోనే శంకుస్థాపన కార్యక్రమం వద్దకు తీసుకొచ్చారని తెలిపారు. ఓయూలో పెంచిన ఫీజుల విషయమై వీసీ ప్రొ.రవీందర్‌ను అడగాలని పూర్వవిద్యార్థులను విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. విద్యార్థులకు ఉపయోగపడే కార్యక్రమాలు కాకుండా సదస్సులు, సంబరాలు, సన్మానాలు తదితర కార్యక్రమాలతో అల్యూమ్ని అసోసియేషన్ నాయకులు కాలక్షేపం చేస్తున్నారని పూర్వ విద్యార్థులకు వివరించారు. ఉస్మానియా ఫౌండేషన్ ద్వారా సేకరించిన నిధులలో ఓయూలో ప్రస్తుతం పీహెచ్‌డీ చేస్తున్న పేద విద్యార్థులకు ఫెలోషిప్‌లు అందచేయాలని కోరినట్లు నెల్లి సత్య తెలిపారు.


మహిళాభివృద్ధితోనే దేశాభివృద్ధి


మాట్లాడుతున్న శ్రీగణేశ్

కంటోన్మెంట్: మహిళాభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమని బీజేపీ నేత ఎన్. శ్రీగణేశ్ అన్నారు. ఈస్ట్ మారేడ్‌పల్లిలోని షెనాయ్ గ్రౌండ్ ఆవరణలో స్థానిక కార్పొరేటర్ కొంతం దీపిక నరేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి ఆయన హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం మహిళల అభ్యున్నతి కోసం అనేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. అనంతరం మహిళలతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన మహిళలకు బహుమతులు అందజేశారు. పిట్ల నగేష్, మాలతీ, మాధవి పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్‌కు క్రేజీ.. సనత్‌నగర్ గ్రౌండ్ బిజీ!

- ప్రత్యేక అసోసియేషన్‌గా ఏర్పడి క్రీడాకారులకు తర్ఫీదు
- రాష్ట్ర, జాతీయ స్థాయికి పునాది ఇక్కడే



సనత్‌నగర్: అక్కడి గ్రౌండ్ హ్యాండ్‌బాల్ క్రీడకు ఊపిరిపోస్తే...ఆ గ్రౌండ్‌నే ఊతంగా చేసుకుని ఎందరో జాతీయ క్రీడాకారులుగా ఎదిగారు. వారంతా ఇప్పుడు ఆ క్రీడనే క్రేజ్ తీసుకువచ్చారు. క్రీడా జగతిలో క్రికెట్, ఫుట్‌బాల్, బ్యాడ్మింటన్ వరుసలో హ్యాండ్‌బాల్‌కూ ఎనలేని ప్రాచుర్యం తీసుకువచ్చేందుకు నిర్విరామ 'కసరత్తు'ను కొనసాగిస్తున్నారు. గేమ్‌లో ఓనమాలు నేర్చుకుంటున్న సందర్భాన చిగురించిన క్రీడాసక్తి వారి కెరీర్‌కు పునాది వేయడమే కాకుండా మరెందరినో హ్యాండ్‌బాల్ క్రీడలో రాటుదేలేలా చేసింది. జాతీయ, అంతర్జాతీయ స్థాయికి చేర్చింది. అలాంటి క్రీడాకారులు సనత్‌నగర్‌లో ఏ గల్లీ కెళ్లినా తారస పడుతుంటారు. క్రీడపై ఉన్న ప్రీతితో నేటి తరం వారిని జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు బీజాలు నాటుతున్నారు. అందుకోసం స్కూల్ స్థాయి నుంచే విద్యార్థులను ప్రోత్సహిస్తూ హ్యాండ్‌బాల్ క్రీడలో ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు . సనత్‌నగర్ కార్మిక సంక్షేమ మైదానం కేంద్రంగా దశాబ్దాల కాలంగా హ్యాండ్‌బాల్ శిక్షణ ఇస్తున్నారు హ్యాండ్‌బాల్ అసోసియేషన్ సభ్యులు.

ఎందరో ఆణిముత్యాలు...

సనత్‌నగర్ లేబర్ వెల్ఫేర్ గ్రౌండ్ హ్యాండ్‌బాల్ క్రీడలో ఎందరో ఆణిముత్యాలను అందించింది. పారిశ్రామికవాడగా కార్మికుల ఆవాసంగా ఉన్న సనత్‌నగర్‌లో పలువురు హ్యాండ్‌బాల్ ఆటలో ఆసక్తి చూపిన క్రమంలో 1975లో స్థానిక ఎస్ఆర్‌టీ కాలనీలోని కార్మిక సంక్షేమ సంఘం భవనం ఆవరణలోని ప్రత్యేక క్రీడా శిబిరం నిర్వహించారు. అలా మొదలైన శిబిరం క్రీడాకారుల్లో మరింత ఆసక్తిని రేకెత్తించింది. ఇక్కడ శిక్షణ పొందిన ఎంతోమంది జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని క్రీడాస్ఫూర్తిని రగిలించారు. వారిలో సనత్‌నగర్ మాజీ కార్పొరేటర్ అయూబ్‌ఖాన్, మక్సూద్, జగన్నాథం, సుభోద్ విల్సన్, ప్రబోధ్ విల్సన్, డాక్టర్ నగేశ్, విద్య, ఏఎస్ మునవర్, పీవీ నాగార్జున, ధన్‌రాజ్ తదితరులు హ్యాండ్‌బాల్ క్రీడాకారులుగా వెలుగులోకి వచ్చినవారే. అలాగే సనత్‌నగర్‌కు చెందిన ఎంఏ అజీజ్ ఏకంగా అంతర్జాతీయ స్థాయిలో పాల్గొన్న ఘనతను దక్కించుకున్నారు. మరో క్రీడాకారుడు బాసిత్ ఆసియా క్రీడల ప్రాబబుల్స్‌లో స్థానం కైవసం చేసుకున్నాడు. వీరంతా వృత్తిపరంగా వేర్వేరు రంగాల్లో ఉన్నప్పటికీ హ్యాండ్‌బాల్ క్రీడపై అభిమానాన్ని మాత్రం విడవలేదు. ఇక్కడే శిక్షణ తీసుకుని కోచ్‌లుగా ఎదిగిన వారు ఎందరో ఉన్నారు.


హ్యాండ్‌బాల్‌లో శిక్షణ పొందిన క్రీడాకారులు..(ఫైల్)

నిర్విరామంగా శిక్షణ..

జాతీయ స్థాయిలో రాణించిన ఆనాటి మేటి క్రీడాకారులంతా సంఘటితమై 1980లో అప్పటి రంగారెడ్డి జిల్లా (ప్రస్తుత మేడ్చల్ జిల్లా)హ్యాండ్‌బాల్ అసోసియేషన్ (రిజిస్టర్డ్ నెంబర్: 1859)ను ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఇప్పటివరకు కొన్ని వేల మంది హ్యాండ్‌బాల్ క్రీడాకారులను తీర్చిదిద్దారు. ఎక్కడ ఏ పోటీ జరిగినా జిల్లా నుంచి పాల్గొనే టీమ్‌ను సన్నద్ధం చేసేది ఈ అసోసియేషనే సభ్యులే. మొదట స్కూల్ లెవల్ క్యాంపులు నిర్వహించి హ్యాండ్‌బాల్ క్రీడలో ఉచితంగా శిక్షణ ఇస్తారు. ఆ తర్వాత వారికి మెలకువలు నేర్పి అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా ప్రోత్సహిస్తుంటారు. ఇక్కడి గ్రౌండ్‌లోనే శిక్షణ పొందిన వారే కోచ్‌లు వ్యవహరిస్తూ ఉచితంగా శిక్షణ అందిస్తుండడం గమనార్హం.

స్పోర్ట్స్ కోటాలో ఎందరో...

జనరల్ కోటాలో సీటు రానివారికి హ్యాండ్‌బాల్ క్రీడే ఆపన్నహస్తంగా మారుతోంది. ఈ క్రీడలో గతంలో జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఆడినవారు పదుల సంఖ్యలో స్పోర్ట్స్ కోటాలో సులభంగా సీట్లు సాధించారు.

మహిళను రక్షించిన లైఫ్ గార్డులకు అభినందనలు

రాంగోపాల్‌పేట్: ప్రమాదవశాత్తు హుస్సేన్ సాగర్‌లో పడిపోయిన ఓ మహిళను రక్షించిన పర్యాటక శాఖకు చెందిన లైఫ్ గార్డులను సెక్రటరియేట్ పోలీసులు అభినందించారు. ఈ నెల 7వ తేదీన అశ్విని అనే మహిళ నెక్లెస్ రోడ్డులో ప్రమాదవశాత్తు పడిపోయింది. వెంటనే అక్కడే విధుల్లో ఉన్న లైఫ్ గార్డులు సురేష్, సుధీర్ కుమార్ నీళ్లలోకి దూకి ఆమెను బయటకు తీశారు. గురువారం సెక్రటరియేట్ ఎస్సై కిరణ్‌కుమార్ ఇద్దరు లైఫ్ గార్డులకు ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు.


ప్రశంసా పత్రాన్ని అందిస్తున్న ఎస్సై కిరణ్‌కుమార్

బోయిన్‌పల్లి మార్కెట్ యార్డులో అగ్ని ప్రమాదం

కంటోన్మెంట్: బోయిన్‌పల్లి మార్కెట్ యార్డులో గురువారం అగ్ని ప్రమాదం సంభవించింది. అధికారులు సకాలంలో స్పందించడంతో పెను ప్రమాదం తప్పింది. మార్కెట్ యార్డ్ లోని గోదాముల వద్ద నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం సంభవించి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు.

ఆలయాభివృద్ధికి సహకరిస్తా


పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే తలసాని

సనత్‌నగర్: ఎన్నో సంవత్సరాల చరిత్ర కలిగిన శ్రీపబ్బా ఆంజనేయ స్వామి ఆలయానికి పూర్వ వైభవం తీసుకొస్తామని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సనత్‌నగర్‌లోని లోధా అపార్ట్‌మెంట్ వెనుక గల మూడు శతాబ్దాలుగా భక్తుల విశేష పూజలు అందుకుంటున్న శ్రీ పబ్బా ఆంజనేయస్వామి మహా కుంభ సంప్రోక్షణ పూజ కార్యక్రమాలలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. అనంతరం పండితులు వేద మంత్రాలతో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు ఆశీర్వచనం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, నాయకులు కొలను బాల్‌రెడ్డి, రాజేష్‌ముదిరాజ్, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఉప్పల యాదగిరి, శేషు, వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్, ఆర్‌సీ పటేల్, భూపాల్‌రెడ్డి, శివశంకర్ పాల్గొన్నారు.

శ్రమించారు.. మిస్టరీని ఛేదించారు

చిలకలగూడ పోలీసులకు రివార్డులు


మిస్టరీని ఛేదించిన పోలీసులతో ఈస్ట్‌జోన్ డీసీపీ గిరిధర్, ఏసీపీ జైపాల్‌రెడ్డి

చిలకలగూడ: గుర్తుతెలియని యువకుడి హత్య కేసును ఛేదించిన చిలకలగూడ పోలీసులకు నగర కొత్వాల్ శ్రీనివాసరెడ్డి, ఈస్ట్‌జోన్ డీసీపీ గిరిధర్ అభినందించి రివార్డులు అందించారు. చిలకలగూడ ఠాణాలో గురువారం జరిగిన మీడియా సమావేశంలో డీసీపీ గిరిధర్ మాట్లాడుతూ.. ఏడు బృందాలను ఏర్పాటు చేసి చాకచక్యంగా వ్యవహరించి, సీసీ కెమెరాల ఫుటేజీల ఆధారంగా నిందితులను అరెస్ట్ చేసినట్లు వివరించారు. సీపీ ఆదేశాల మేరకు చిలకలగూడ ఏసీపీ జైపాల్ రెడ్డి, సీఐ అనుదీప్, డీఐ రమేష్‌గౌడ్, ఎస్ఐలు బాలరాజు, ఆంజనేయులు, కిషోర్, నాగరాజు, కృష్ణ, చిలకలగూడ, వారాసిగూడ, లాలాగూడ, సుల్తాన్‌బజార్ ఠాణాలకు చెందిన క్రైమ్‌టీం కానిస్టేబుళ్లు ప్రకాశ్‌రెడ్డి, రాజు, జగదీష్, మజర్ బాషా, గణేష్, వినయ్‌కుమార్, నవీన్‌కుమార్, శ్రీనివాస్, సుమంత్, సాయిలు, జయకిరణ్, వెంకటేష్‌లకు ప్రశంసపత్రాలు, నగదు రివార్డులు అందించారు.

వందశాతం పన్ను వసూళ్లపై దృష్టి పెట్టండి


అధికారులతో చర్చిస్తున్న శ్రీవత్సా కోట

సనత్‌నగర్: ఆర్థిక సంవత్సరం మరికొన్ని రోజుల్లో ముగుస్తున్న దృష్ట్యా ఆస్తి పన్ను వసూళ్ల లక్ష్యాన్ని చేరుకునేలా అధికారులు పనిచేయాలని స్పెషల్ ఆఫీసర్ శ్రీవత్సా కోట సూచించారు. జీహెచ్ఎంసీ బేగంపేట సర్కిల్ అధికారులతో గురువారం ఆయన సమావేశమై ఆస్తి పన్ను వసూళ్లపై దిశా నిర్దేశం చేశారు. బేగంపేట సర్కిల్‌కు సంబంధించి రూ.108 కోట్ల ఆస్తి పన్ను వసూళ్ల లక్ష్యం కాగా ఇప్పటికి రూ.75 కోట్లు వసూళ్లు జరిగాయన్నారు. మిగతా మొత్తాన్ని కూడా వసూలు చేసే విధంగా అధికారులు చర్యలు ప్రారంభించారు. ముఖ్యంగా మొండి బకాయిల విషయంలో వన్ టైమ్ సెటిల్‌మెంట్ స్కీం కింద వడ్డీపై 90 శాతం రాయితీ కల్పించడం జరిగిందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునే విధంగా విస్తృతంగా ప్రచారం జరగాలన్నారు. మార్చి 31 వరకు మాత్రమే వన్ టైమ్ సెటిల్‌మెంట్ స్కీం అమలులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య, ట్యాక్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'ఖేలో తెలంగాణ-జీతో తెలంగాణ'


క్రీడాకారిణులతో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

రసూల్‌పురా: ఫిట్ ఇండియా నినాదంతో ఖేలో తెలంగాణ-జీతో తెలంగాణ పేరుతో సికింద్రాబాద్ కంటోన్మెంట్ జింఖానా మైదానంలో అటల్ బిహారీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళా క్రీడా పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్, కబడ్డీ పోటీలను ప్రారంభించారు. ప్రధాని మోదీ పిలుపుతో ఫిట్ ఇండియా లక్ష్యంగా క్షేత్రస్థాయిలో యువతలో ఉన్న క్రీడా సామర్థ్యాన్ని వెలికితీసి ప్రోత్సాహాన్ని అందించే దిశగా కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని అదే విధంగా క్రీడా స్ఫూర్తి నింపేందుకు ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఫౌండేషన్ అధ్యక్షురాలు కావ్య కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆజాదీ కా అమృత్ మహోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ పిలుపు మేరకు సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని మహిళ క్రీడ పోటీలు నిర్వహించి వారిని క్రీడల్లో ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కార్పొరేటర్ కొంతం దీపికా, శ్రీగణేష్, మహంకాళి జిల్లా అధ్యక్షులు శ్యాంసుందర్ గౌడ్ పాల్గొన్నారు.

కిడ్నీ రుగ్మతలను ప్రాథమిక దశలో గుర్తిస్తే నియంత్రణ సులభం


జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభిస్తున్న రాజారావు

గాంధీఆస్పత్రి: మూత్రపిండాలకు సంబంధిత రుగ్మతలను ప్రాథమిక దశలో గుర్తించి సరైన వైద్యసేవలు అందిస్తే నియంత్రణ సులభమని వైద్య నిపుణులు సూచించారు. ప్రపంచ కిడ్నీ దినోత్సవాన్ని పురస్కరించుకుని గాంధీ ఆస్పత్రి నెఫ్రాలజీ విభాగం నేతృత్వంలో గురువారం పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ రమేష్‌రెడ్డి, సూపరింటెండెంట్ రాజారావు ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కిడ్నీ సంబంధ వ్యాధులపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కిడ్నీ సమస్యతో బాధపడుతున్న రోగి కుటుంబం మానసిక, శారీరక, ఆర్థిక ఇబ్బందులకు గురవుతారని వివరించారు. మారుతున్న ఆహారపు అలవాట్లు, ఊబకాయం, మత్తు పదార్థాల సేవనం, జంకు ఫుడ్, శారీరక శ్రమ లేకపోవడం తదితర అంశాల వలన కిడ్నీ సమస్యలు ఉత్పన్నం అవుతాయన్నారు. ఈ ఏడాది 'కిడ్నీ హెల్త్ ఫర్ ఆల్' నినాదంలో మరిన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం కిడ్నీల ప్రాముఖ్యం, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నూతన వైద్య విధానాలు, కిడ్నీ మార్పిడి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. వైద్య విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. మెడికల్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమోహన్, నెఫ్రాలజీ హెచ్‌ఓడీ మంజూష, వైద్యులు విక్రం, శ్రీకాంత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముదిరాజ్‌లకు కార్పొరేషన్ ఏర్పాటు హర్షణీయం


రాజేష్ ముదిరాజ్

లాలాపేట: రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణలోని ముదిరాజ్‌లకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయడం హర్షణీయమని రాష్ట్ర ముదిరాజ్ విద్యార్థి సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు రాగి రాజేష్ ముదిరాజ్ అన్నారు. ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా పాలన ద్వారా ఎన్నో చరిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంటున్నారని కుల వృత్తులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించాలనే ఉద్దేశంతో బీసీ కులాలకు ప్రత్యేకంగా కార్పొరేషన్లు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.

'మోండా మార్కెట్' సమస్యలన్నీ పరిష్కరిస్తాం


మోండా మార్కెట్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ కొంతం దీపికా, సమ్మయ్య

బన్సీలాల్‌పేట్: మోండా మార్కెట్‌లో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు కార్పొరేటర్ కొంతం దీపికా పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య, శానిటేషన్ సూపర్‌వైజర్ ధనాగౌడ్, తేజస్వీనితో కలిసి గురువారం మోండా మార్కెట్‌లో పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. మోండా మార్కెట్‌లో పలు సమస్యలను గుర్తించడం జరిగిందని వీటికి సంబంధించి జీహెచ్ఎంసీ అధికారులు సుమారు రూ.కోటి వ్యయం అయ్యే పనుల ప్రతిపాదనలు సిద్ధం చేశారని చెప్పారు. నిధులు మంజూరైన వెంటనే మోండా మార్కెట్‌లో పనులు ప్రారంభించి అభివృద్ధి చేస్తామన్నారు. మోండా మార్కెట్‌లో చెత్తా గ్యార్బేజీని తొలగిస్తారన్నారు. స్థానిక చిరువ్యాపారులు వ్యర్థాలను వేయడానికి ప్రత్యేకంగా ఓ వాహనాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. మోండా మార్కెట్‌లో పశువుల సంచారాన్ని అరికట్టడానికి వెటర్నరీ విభాగం అధికారులు చర్యలు తీసుకుంటున్నారని వివరించారు. డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య మాట్లాడుతూ.. మోండా మార్కెట్‌లో ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని అరికట్టడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. వ్యాపారులు ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని తగ్గించాలని సూచించారు. వచ్చే మంగళవారం 19వ తేదీ నుంచి మార్కెట్‌లో ప్లాస్టిక్ కవర్లను వినియోగించరాదని నిబంధనలు ఉల్లంఘిస్తే వ్యాపారులపై జరిమానా వేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వ్యాపారులతో పాటు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ రూపురేఖలు మారుస్తాం


సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

అడ్డగుట్ట: సికింద్రాబాద్ రూపురేఖలు మార్చేందుకు నియోజకవర్గ అభివృద్ధికి ఐదు కోట్లు మంజూరైనట్లు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, సికింద్రాబాద్ ఇన్‌చార్జ్ అదం సంతోష్ తెలిపారు. గురువారం తుకారాంగేట్‌లోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో కానీ.. సికింద్రాబాద్ నియోజకవర్గంలో చెప్పుకోదగిన సంక్షేమం, అభివృద్ధి జరగలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 100 రోజుల లోనే ఇచ్చిన గ్యారంటీలను అమలు చేస్తూ వస్తుందన్నారు. అంతే కాక నియోజకవర్గాల వారీగా అభివృద్ధి చేసేందుకు ఇప్పటికే నిధులు కూడా మంజురు చేసిందని తెలిపారు. అందులో భాగంగా రాష్ట్ర మంత్రి మంత్రి పొన్నం ప్రభాకర్ ఆయన స్పెషల్ ఫండ్స్ నుంచి సికింద్రాబాద్ నియోజకవర్గ అభివృద్ధి కోసం సుమారు రూ. 5 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక చొరవ చూపుతుందనారు. ఈ సమావేశంలో అమర్‌నాథ్ గౌడ్, అనిల్ కుమార్, గంట రాజుసాగర్, శిల్పా చారి, గుంటి కృష్ణ, మంజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి


మాట్లాడుతున్న కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి

అడ్డగుట్ట: మహిళలు చైతన్యవంతులైనప్పుడే హక్కులను సాధించుకోగలరని ఎంవీ ఫౌండేషన్ జాతీయ కన్వీనర్ ఆర్. వెంకట్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం అడ్డగుట్టలోని బీజేఆర్ కమ్యూనిటీహాల్లో ఎంవీ ఫౌండేషన్, తల్లుల సంఘం, బాలల హక్కుల పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి, ఫౌండేషన్ జాతీయ కన్వీనర్ వెంకట్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. నేటి సమాజంలో మహిళలు తమదైన శైలిలో అన్ని రంగాల్లో దూసుకుపోతున్నారన్నారు. పురుషులకు దీటుగా అన్నిట్లో తమ ప్రతిభ కనబరుస్తూ చరిత్ర సృష్టిస్తున్నారన్నారు. సమాజంలో ఎక్కడ సమస్యలు ఏర్పడిన మహిళలు స్పందించాలని, అప్పుడే మహిళ తన హక్కులను సాధించుకోగలుతారన్నారు. అంతే కాకుండా నగరంలో పిల్లలందరూ మద్యం, మాదకద్రవ్యాలకు బానిసలు అవుతున్నారని, అలాంటి వాటికి దూరంగా ఉంచాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో భాగ్యలక్ష్మి, శంకర్, ఏవీఎం. స్వామి, సీహెచ్. లక్ష్మీనారాయణ, జమున, నర్సింగరావు, సుమలత, మహేందర్, సమ్మయ్య, రామలీల, పుష్ప, సువర్ణ, భాగ్య, లావణ్య, సౌజన్య పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత



రాంగోపాల్‌పేట్: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ మహిళకు చికిత్స కోసం సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ సిఫార్సు మేరకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించింది. మారుతీ వీధికి చెందిన శారద అనే మహిళ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుంది. ఆస్పత్రి చికిత్స కోసం ఆర్థిక సహాయం అవసరం కావడంతో మాజీ కార్పొరేటర్ ఆకుల రూప సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ దృష్టికి తీసుకుని వెళ్లారు. ఆయన సిఫార్సు మేరకు రూ.1,20,000 ఎల్‌ఓసీ మంజూరు గురువారం ఆకుల రూప అందజేశారు.

పోస్టర్ ఆవిష్కరణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ టెక్నాలజీ కాలేజీలో ఈ నెల 18, 19, 20 తేదీల్లో జరిగే జాతీయ స్థాయి టెక్నోస్మానియా-2024 వాల్‌పోస్టర్‌ను గురువారం ప్రిన్సిపల్ ప్రొ.చింత సాయిలు ఆవిష్కరించారు. కెమికల్, ఫుడ్, టెక్స్‌టైల్స్ టెక్నాలజీలలో మూడు రోజుల పాటు జరిగే కార్యక్రమంలో సదస్సులు, టెక్నికల్ లెక్చర్స్, ఎగ్జిబిషన్స్, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని కన్వీనర్ డాక్టర్ శ్రీనునాయక్ తెలిపారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రొ.చింత సాయిలు

రాజకీయాలకతీతంగా అభివృద్ధి


మాట్లాడుతున్న డాక్టర్ కోట నీలిమ

పద్మారావునగర్: సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాజకీయాలకతీతంగా అభివృద్ధి జరుగుతోందని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులంతా సద్వినియోగం చేసుకోవాలని సనత్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ డాక్టర్ కోట నీలిమ అన్నారు. గురువారం విక్టోరియాగంజ్ బస్తీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. బడుగు బలహీనవర్గాల కోసం ప్రభుత్వం పలు కార్యక్రమాలను అమలు చేస్తుందని ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తోందన్నారు. విక్టోరియాగంజ్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. మహిళల సమగ్రాభివృద్ధికి తనవంతు బాధ్యతగా చర్యలు తీసుకుంటానని ఎలాంటి సమస్యలున్నా ప్రజలు తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి చర్యలు చేపడుతానన్నారు. ఈ సమావేశంలో బస్తీ అధ్యక్షులు ఎస్.ఆర్ మల్లేష్, కాంగ్రెస్ పార్టీ ఏ-బ్లాక్ అధ్యక్షులు టి. మనోజ్‌కుమార్, నాయకులు డాక్టర్ శివకుమార్, హేమంత్ సింగ్, శివ,లావణ్య, చంద్రశేఖర్, కుమార్, విక్కీ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్లు చోరీ చేస్తున్న ఇద్దరి రిమాండ్


షేక్ హమీద్


షేక్ హఫీజ్ ఉద్దీన్

రాంగోపాల్‌పేట్: సెల్‌ఫోన్లను చోరీ చేస్తున్న ఇద్దరిని రిమాండ్‌కు తరలించిన ఘటన గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. దమ్మాయిగూడకు చెందిన షేక్ హమీద్ అలియాస్ సోహైల్ (21), డబీర్‌పురాకు చెందిన షేక్ హఫీజ్ ఉద్దీన్ (22) స్నేహితులు. జల్సాలకు అలవాటు పడిన ఇద్దరు మొబైల్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్నారు. ఈ నెల 10న సినీ కో డైరెక్టర్‌గా పనిచేసే రాజమౌళి పనిమీద చిక్కడపల్లి వెళ్లి జూబ్లీహిల్స్‌లోని మరో స్నేహితుడిని కలిసేందుకు వెళ్తున్నాడు. ఆయన సికింద్రాబాద్ ఈస్ట్ మెట్రో స్టేషన్ ప్రాంతంలోని బ్లూ సీ హోటల్ వద్ద వేచి చూస్తున్నాడు. అదే సమయంలో ద్విచక్ర వాహనంపై వచ్చిన నిందితులు ఆయన చేతిలోని మొబైల్ ఫోన్ లాక్కుని సంగీత్ థియేటర్ వైపు వెళ్లిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఏసీపీ సుబ్బయ్య, ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ రెడ్డి ఆదేశాల మేరకు అదనపు ఇన్‌స్పెక్టర్ కౌశిక్, ఎస్సై సుబ్బారావు నిందితుల కోసం గాలింపు చేపట్టారు. బుధవారం సంగీత్ చౌరస్తాలో వాహనాలు తనిఖీ చేస్తుండగా బైక్‌పై వచ్చిన ఇద్దరిని ఆపి విచారించగా ఫోన్ స్నాచింగ్‌కు పాల్పడినట్లు ఒప్పుకున్నారు. నిందితుల నుంచి 3 ఫోన్లు, ఓ ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు షేక్ హమీద్‌పై బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోక్సో కేసు షేక్ హఫీజుద్దీన్‌పై రెయిన్‌బజార్, మాదన్నపేట పోలీస్ స్టేషన్ల పరిధిలో 4 దొంగతనాల కేసులు ఉన్నాయి. ఇద్దరిని రిమాండ్‌కు తరలించారు.

చికిత్స పొందుతున్న గుర్తు తెలియని వ్యక్తి మృతి

రాంగోపాల్‌పేట్: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై వేణుగోపాల్ వివరాల ప్రకారం.. గత నెల 15న సెయింట్ మేరీస్ రోడ్డులోని అబిజిత్ వైన్స్ ప్రాంతంలో 30 ఏళ్ల వ్యక్తి రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని కారు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఈ నెల 13న మృతి చెందాడు. మృతదేహాన్ని గాంధీ మార్చురీలో భద్రపరిచారని సంబంధీకులు ఎవరైనా ఉంటే గోపాలపురం పోలీస్ స్టేషన్ లేదా 8712660248 నంబర్‌ను సంప్రదించాలని పోలీసులు సూచించారు.

రైలు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

అడ్డగుట్ట: వేర్వేరు రైలు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే పోలీసుల వివరాల ప్రకారం.. మేడ్చల్- మనోహరాబాద్ రైల్వే స్టేషన్ల మార్గమధ్యలోని పట్టాలపై బుధవారం సాయంత్రం సుమారు 35 నుంచి 40 సంవత్సరాల మధ్య వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడు పసుపు రంగు షర్ట్, క్రీం కలర్ ప్యాంట్ ధరించినట్లు తెలిపారు.

పట్టాలు దాటుతుండగా..

పట్టాలపై నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గురువారం ఉదయం 7.30 సమయంలో లాలాగూడ-మౌలాలి రైల్వే స్టేషన్ల మధ్య పట్టాలపై సుమారు 40 ఏళ్ల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన రైలు ఢీకొట్టడంతో మృతి చెందాడు.

చైల్డ్ పోర్నోగ్రఫీ చూడటం నేరం

పద్మారావునగర్: చైల్డ్ పోర్నోగ్రఫీ చూడటం చట్టరీత్యా నేరమని, పోక్సో చట్టం ప్రకారం శిక్షించబడుతారని ఆశ్రిత స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి, హైదరాబాద్ జిల్లా జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్స్ అలయెన్స్ పార్టనర్ నాగరాజు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. చైల్డ్ పోర్నోగ్రఫీ చూడటం, వీడియో కంటెంట్ కలిగి ఉన్నా సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. చైల్డ్ పోర్నోగ్రఫీపై ఇటీవల మద్రాస్ హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించిందని గుర్తు చేశారు. ఈ విషయమై దేశంలోని పలు స్వచ్ఛంద సంస్థలు జోక్యం చేసుకొని అభ్యంతరం చెప్పడంతో కోర్టు సంచలన తీర్పు ఇచ్చిందన్నారు.